# మెడికల్ మాఫియా జీరో దందా!?



- ఇష్టారాజ్యంగా ఔషధాల విక్రయాలు
- అధిక ధరకు జనరిక్ మందులు
- బిల్లులు లేకుండా శాంపిల్స్ అమ్మకాలు
- నిద్రావస్థలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు
- మెడికల్ షాపుల యజమానుల సంఘాల గుప్పెట్లో అధికారులు

పాలకుర్తికి చెందిన నిరక్షరాస్యుడైన ఓ రైతు పెద్దపల్లిలోని ఓ మెడికల్ షాపులో మందులు కొనేందుకు వెళ్లగా.. శాంపిల్ టాబ్లెట్స్ ఇచ్చారు. రసీదు కూడా ఇవ్వలేదు. సదరు మందులను రైతు ఇంటికి తీసుకువెళ్లగా.. ఆయన మనువడు వాటిని చూసి 'ఇవి శాంపిల్ మందులు.. నీకు ఎవరిచ్చారు? ఫ్రీగా ఇచ్చారా..?' అని అడిగాడు. డబ్బులకు కొన్నానని చెప్పడంతో అతడిని తీసుకొని ఆ మెడికల్ షాపునకు వెళ్లి నిర్వాహకులను నిలదీశాడు. దీంతో అవాక్కైన మెడికల్ షాపు యజమాని బతిమిలాడి కాళ్లబేరానికి వచ్చాడు. ఇలా మెజార్టీ మెడికల్ షాపుల్లో జీరో దందా నడిపిస్తూ.. శాంపిల్, నాణ్యతలేని మందులను అంటగడుతూ అందినకాడికి దోచుకుంటున్నట్టు తెలిసింది.



పెద్దపల్లి, జూన్ 7(నమస్తే తెలంగాణ): పెద్దపల్లి జిల్లాలో మెడికల్ షాపులపై నియంత్రణ కొరవడింది. తక్కువ ధరకే దొరికే జనరిక్ మందులను అధిక ధరకు విక్రయిస్తూ సామాన్యులను దోచుకుంటున్నారు. జ్వరం వచ్చిందనో.. జలుబు చేసిందనో డాక్టర్ దగ్గరకు వెళ్తే.. ₹వంద నుంచి ₹500 వరకు ఫీజు చెల్లించాల్సి వస్తుందనే ఉద్దేశంతో పేదలు నేరుగా మెడికల్ షాపులకు వెళ్తుండగా, ఇదే అదనుగా షాపు యజమానులు దండుకుంటున్నారు. వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు విక్రయిస్తున్నారు. హోల్‌సేల్ వ్యాపారులు మెడికల్ దుకాణాలకు ఇచ్చే ప్రతి డ్రగ్‌పై బ్యాచ్ నంబర్ ఉంటుంది. ఇలా రిటైల్ దుకాణాలకు ఇచ్చే సమయంలో బిల్లుపై పొందుపర్చిన బ్యాచ్ నంబర్, కొనుగోలుదారులకు ఇచ్చే బిల్లుపై రాసే బ్యాచ్ నంబరు కూడా ఒక విధంగా ఉంటేనే సరైనవేనని నమ్మవచ్చు. కానీ, రెండు బిల్లులపై వేర్వేరు నంబర్లు ఉండడంతో నకిలీ మందుల దందా కొనసాగుతుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

### నియంత్రణ కరువు

హోల్‌సేల్ ఏజెన్సీలతోపాలు, మెడికల్ దుకాణాలపై ఔషధ నియంత్రణ విభాగం నిఘా పూర్తిగా కొరవడింది. పెద్దపల్లి జిల్లాలో ఎన్ని షాపులకు అనుమతి ఉంది? నిబంధనలు అతిక్రమిస్తూ మందులు ఎవరు విక్రయిస్తున్నారనే విషయంపై తనిఖీలు ఉండడం లేదు. దీంతో మందుల పాపుల యజమానులు జనరిక్ మందులు ఇచ్చి బ్రాండెడ్ మందుల ముసుగులో దోపిడీ చేస్తున్నారు. ఒకే రకమైన మందుల్ని తయారు చేస్తున్న కొన్ని కంపెనీలు జనరిక్‌పై ఒక ధర, బ్రాండెడ్ మందులపై మరో ధర ముద్రిస్తున్నాయి. మరికొన్ని కంపెనీలు రెండు ధరలను ముద్రించడంతో గందరగోళం నెలకొంటున్నది. దీంతో రెండు రకాల మందుల ధరల్లో భారీ వ్యత్యాసం ఉంటున్నది.

### నిబంధనలు గాలికి..

వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించవద్దనే నిబంధనను మెడికల్ షాపుల యజమానులు తుంగలో తొక్కుతున్నారు. మెడికల్ షాపు నిర్వహించే ఫార్మసిస్టు డ్రెస్ కోడ్‌తోపాటు మందులు అందించే సమయంలో గ్లౌజులు వేసుకోవాలి. కొన్ని మందులను ఫ్రిజ్‌లో మాత్రమే భద్రపరచాలి. వినియోగదారుడికి కచ్చితంగా మందుల వివరాలతో కూడిన బిల్లు ఇవ్వాలి. కానీ, ఏదో ఒకటి, రెండు షాపుల్లో తప్ప మిగతా దుకాణాల్లో ఇది అమలు కావడం లేదు. మెడికల్ దుకాణాల యజమానుల యూనియన్ కనుసన్నల్లో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు నడుస్తున్నారనే ఆరోపణలున్నాయి.

### కమీషన్ మాయాజాలం

మందుల విక్రయం పెద్ద వ్యాపారంగా మారింది. తమ కంపెనీకి చెందిన ₹కోటి విలువ చేసే మందులు సేల్ చేస్తే అందులో 40 శాతం కమీషన్ ఇస్తామని నిర్వాహకులు వైద్యులతో ఒప్పందాలు చేసుకుంటున్నటు తెలుస్తున్నది. దీంతో వైద్యులు ఆ కంపెనీ మందులు సేల్ చేసేందుకు అవసరం ఉన్నా లేకున్నా రోగుల నెత్తిన రుద్దుతున్నారు. ప్రొటీన్ పౌడర్ బ్రాండెడ్ ₹150కి లభిస్తుండగా జనరిక్‌లో ₹25కు లభిస్తుంది. ఎన్‌జైమ్ సిరప్ ₹60కు లభిస్తే జనరిక్‌లో ₹25కు, ట్యాబ్లెట్ ఎసినిక్ ప్లస్ బ్రాండెడ్‌లో ₹50కు లభిస్తుండగా, జనరిక్ షాపుల్లో ₹10లకు దొరుకుతున్నది. అయితే, మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో జనరిక్ మందుల షాపులు ఏర్పాటు చేయని కారణంగా రోగులు, పేదలు తీవ్రంగా నష్టపోతున్నారు.



తెరుచుకోని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం

**మందుల ధర జనరిక్, ఇతర మెడికల్ షాపుల్లో తేడాలు**

| మందులు(షీట్లలో) | జనరిక్ ధర | మెడికల్ షాప్ ధర |
|---|---|---|
| షుగర్‌కు సంబంధించిన మెడిసిన్ | | |
| గిమోపిరైడ్ 1ఎంజీ+మెట్‌ఫార్మిన్ 500 | రూ.15.00 | రూ. 79.90 |
| ఒగ్లిబోస్ 0.20 ఎంజీరూ.31.00 | రూ. 294 | |
| డప్పాగ్లీ ఫ్లోజిన్ 10ఎంజీ | రూ.70.00 | రూ. 192 |
| టెనిగ్లిప్టిన్ 20ఎంజీ రూ.50.00 | రూ. 248 | |
| మెట్‌ఫార్మిన్ 500ఎంజీ | రూ.15.00 | రూ. 25 |
| బీపీకి సంబంధించిన మెడిసిన్ | | |
| అటెనోలాల్ 50 ఎంజీ | రూ.10.00 | రూ. 23 |
| ఆమ్లోడిఫిన్ 5ఎంజీ రూ.10.0 | రూ. 65 | |
| టెల్మీసర్టాన్ 40ఎంజీ రూ.20.00 | రూ. 200 | |
| మెటో ప్రొలాల్ 50ఎంజీ | రూ.17.00 | రూ. 130 |
| ఒల్మాసర్టాన్ 20ఎంజీ | రూ.50.00 | రూ. 110 |
| యాంటిబయాటిక్ మందులు | | |
| అమాక్సిలిన్ 625ఎంజీ | రూ.100.00 | రూ. 191 |
| సెఫోడాంక్సిమ్ 200ఎంజీ | రూ.90.00 | రూ. 205 |
| సెఫిక్సిన్ 200ఎంజీ రూ.70.00 | రూ. 215 | |
| డాక్సి సైక్లిన్ 100ఎంజీ | రూ.70.00 | రూ. 106 |
| గ్యాస్ట్రిక్ | | |
| పాంటప్రజోల్ 40ఎంజీ | రూ.20.00 | రూ. 170 |
| రబెప్రజోల్ 20ఎంజీ | రూ.15.00 | రూ. 167లు |

### తెరుచుకోని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆఫీస్

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గల ఔషధ తనిఖీ అధికారి (డ్రగ్ ఇన్స్‌పెక్టర్) కార్యాలయం అసలు తెరుచుకోవడం లేదు. ఈ విషయంపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించగా.. తమ కార్యాలయానికి సిబ్బంది లేరని, తాను ఎప్పుడూ తనిఖీలు, ఇతర కేసులకు సంబంధించి వెళ్లాల్సి ఉంటుందని, అందువల్లే కార్యాలయంలో ఉండడం లేదని తెలిపారు. అయితే జిల్లాలో తనిఖీలు జరిగినట్లు కూడా నెలకు ఒక్క ప్రకటన కూడా మీడియాకు రాదు. దీంతో అసలు జిల్లాలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉన్నాడా.. లేడా? అన్నట్టుగానే ఉన్నది.

# ఉద్యోగులను కాంగ్రెస్ కించపరిచింది

- ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి నిండా ముంచింది
- వెంటనే పెండింగ్ డీఏలు చెల్లించాలి
- నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత


మాట్లాడుతున్న నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, జూన్ 7 : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం కించపరిచిందని నిజామాబాద్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. శనివారం జగిత్యాల జిల్లాలో పర్యటించిన ఆమె పలు శుభకార్యాలకు హాజరయ్యారు. పలువురు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా జగిత్యాలలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వారిని విస్మరించిందని ధ్వజమెత్తారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేస్తామని చెప్పి కేవలం ఒక్క డీఏ విదిల్చిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీరుపై ఉద్యోగులంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, బాధపడుతున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలను ఉద్యోగులకు ఇచ్చి వారిని నిండా ముంచిందని, అన్ని హామీలను వెంటనే నెరవేర్చాలని, పెండింగ్ డీఏలన్నీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జూన్ 7 : ఓపెన్ స్కూల్ సొసైటీ 2024–25 పదో తరగతి, ఇంటర్ ఫలితాలు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు కరీంనగర్ డీఈవో మొండయ్య, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగిత్యాలలో పదో తరగతిలో 571 మందికి 245 మంది ఉత్తీర్ణత సాధించారని, ఇంటర్‌లో 574 మందికి 305 ఉత్తీర్ణత సాధించారన్నారు. అలాగే, పెద్దపల్లిలో పదో తరగతిలో 340 మందికి 197 మంది, ఇంటర్‌లో 705 మందికి 396 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. కరీంనగర్‌లో పదో తరగతిలో 440 మందికి 324 మంది, ఇంటర్‌లో 967 మందికి 661 మంది, రాజన్న సిరిసిల్లలో పదో తరగతిలో 267 మందికి 240 మంది, ఇంటర్‌లో 792లో 558 ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. ఓపెన్ స్కూల్ సొసైటీలో 2025–26 సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈ నెల 12 నుంచి ఆగస్టు 12 వరకు దరఖాస్తు చేసుకోవాలని, ఇందు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 83092 12661లో సంప్రదించాలని సూచించారు.


తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చిన చింతలపల్లి గ్రామస్తులు

# ఇసుక ట్రాక్టర్లు పోనివ్వద్దు!

- చింతలపల్లిలో గ్రామస్తుల ఆందోళన
- పోలీసులు, రెవెన్యూ అధికారులకు మొర

సిరిసిల్ల రూరల్, జూన్ 7: తమ గ్రామం నుంచి ఇసుక ట్రాక్టర్లు పోనివ్వకుండా చూడాలని తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూర్ గ్రామ పరిధిలోని చింతలపల్లి గ్రామస్తులు శనివారం గ్రామంలో ఆందోళన చేపట్టారు. అనంతరం తంగళ్లపల్లి మండల కేంద్రానికి తరలివచ్చి పోలీస్ స్టేషన్, తహసీల్ కార్యాలయాలకు వెళ్లి పోలీసులు, రెవెన్యూ అధికారులతో మొర పెట్టుకున్నారు. ఈ సందర్భంగా చింతలపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ, మానేరు వాగు ఆనుకొని ఉన్న తమ గ్రామంలోంచి ఇసుక వే బిల్లులతో 100 నుంచి 200 ట్రాక్టర్లు నడుస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామంలోంచి ట్రాక్టర్లు అతి వేగంగా వెళ్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇసుక ట్రాక్టర్లు గండిలచ్చపేట వంతెన కింది నుంచి నక్కవాగు ఒడ్డు మీదుగా మానేరు వాగులోకి వెళ్లడానికి అనువుగా ఉంటుందని తెలిపారు. అధికారులు స్పందించి ఇసుక ట్రాక్టర్లు నక్కవాగు ఒడ్డు మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో చింతలపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

# డీ సెట్ ఫలితాలు విడుదల

తిమ్మాపూర్, జూన్ 7 : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ రెండేళ్ల కోర్సులో చేరేందుకు నిర్వహించిన డీసెట్‌కు సంబంధించిన ఫలితాలు విడుదలైనట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్ మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న అర్హత సాధించిన అభ్యర్థులకు ఎల్ఎండీలోని డైట్ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీల్లో హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, అన్ని విద్యార్హత పత్రాలు, ఆదాయ కుల సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు డీ సెట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని చెప్పారు.




# కరీంనగర్ బస్టేషన్‌లో భద్రత డొల్ల

ఆర్టీసీ బస్టాండ్

- వరుస దొంగతనాలతో ప్రయాణికుల బెంబేలు
- పోలీసు ఔట్ పోస్టు ఉన్నా ఆగని ఘటనలు
- పనిచేయని సీసీ కెమెరాలు
- ఆందోళనలో ప్రయాణికులు
- సిబ్బంది కొరతతో నిస్తేజంగా విజిలెన్స్ అధికారులు

**రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ప్రయాణ ప్రాంగణంగా పేరుగాంచిన కరీంనగర్ బస్టేషన్ భద్రత డొల్లగా మారింది. అధికారుల నిర్లక్ష్యం.. పట్టింపులేమితో కొంతకాలంగా దొంగతనాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, విజిలెన్స్ విభాగం ఉన్నా సిబ్బంది కొరత వేధిస్తుండడం, పోలీసు ఔట్ పోస్టు ఉన్నా అంతంత మాత్రంగానే పర్యవేక్షిస్తుండడం జేబు దొంగలకు కలిసివస్తున్నది. నిత్యం చోరీలు జరుగుతూనే ఉండగా, ప్రయాణికుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించాలనే డిమాండ్ వినిపిస్తున్నది.**




కరీంనగర్ తెలంగాణచౌక్, జూన్ 7: జిల్లా కేంద్రంలో బస్టేషన్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తరలివెళ్లే లక్షలాది ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రయాణికుల తరలింపులో రాష్ట్రంలోనే మొదటి స్థానంలోనే ఉంది. రీజియన్ పరిధిలోని 11 డిపోలకు చెందిన 911 బస్సులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రీజియన్ల నుంచి నిత్యం 1800 బస్సులు ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. బస్టాండ్‌లో 43 ప్లాట్ ఫారంలు ఉండగా, వచ్చీపోయే వారితో సందడిగా ఉంటుంది. అయితే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఏడాదిన్నరగా రోజూవారీ ప్రయాణికుల సంఖ్య 60వేల నుంచి 90 వేలకు పెరిగింది. పండుగలు, వారంతపు సెలవుల్లో ఈ సంఖ్య మరో 20 వేలు ఎక్కువగా ఉంటున్నది. ఇంత మంది ప్రయాణికుల రద్దీతో కళకళలాడే బస్టేషన్‌లో భద్రత లోపించడంతో కొన్ని రోజులుగా దొంగతనాలకు కేరాఫ్‌గా మారిపోగా, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.



బస్టాండ్‌లోని పోలీసు ఔట్ పోస్టు

### విజిలెన్స్‌లో సిబ్బంది కొరత

ఆర్టీసీలో విజిలెన్స్ ప్రత్యేక విభాగం ఉన్నా సిబ్బంది కొరత వేధిస్తున్నది. 14 మంది సెక్యూరిటీ సిబ్బంది ఉండాల్సి ఉండగా, కేవలం ఆరుగురే ఉన్నారు. పని ఒత్తిడితో పూర్తిస్థాయిలో విధులు నిర్వర్తించలేకపోతున్నారని తెలుస్తున్నది. సీఐ, ఏఎస్ఐ, కానిస్టేబుల్ ఉన్నా సరిపడా సిబ్బంది కొరతతో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయలేకపోతున్నారు. జోనల్ విజిలెన్స్ అధికారి నెల రోజులుగా సెలవుపై వెళ్లడంతో పర్యవేక్షణ లోపం కనిపిస్తున్నది. లక్షలాది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే బస్టేషన్‌లో భద్రత పెంచాలని, దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### ప్రయాణికుల భద్రతకు అన్ని రకాల చర్యలు..



బస్టేషన్‌లో ప్రయాణికుల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. పోలీసుల ఆధ్వర్యంలో ఔట్ పోస్టు కూడా ఏర్పాటు చేశాం. ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది పగలూ రాత్రి పనిచేస్తున్నారు. పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నాం. పాడైన సీసీ కెమెరాలను వెంటనే సరిచేస్తున్నాం. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సిబ్బందిని సంప్రదించాలి.

\- రాజు (కరీంనగర్ రీజియన్ మేనేజర్)

### పనిచేయని కెమెరాలు.. ఔట్ పోస్టుతో నిష్ప్రయోజనం..


బంగారం పోగొట్టుకున్న బాధితురాలు శారద (ఫైల్)

బస్టేషన్‌లో జేబు దొంగల బెడద ఎక్కువైంది. ప్రయాణికుల బంగారు నగలు, బ్యాగులు, సెల్‌ఫోన్ల దొంగతనాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. అయితే ప్రయాణికుల భద్రత కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్మార్ట్ సిటీ నిధులతో బస్టేషన్‌లో 65 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా, అందులో మెజార్టీ పనిచేయడం లేదు. కొన్ని పనిచేసినా పోలీసులకు ఆపరేటింగ్ రాకపోవడంతో ఘటన జరిగినప్పుడు వెనువెంటనే స్పందించలేకపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా, దొంగతనాల అడ్డుకట్టకు పోలీసు శాఖ తరపున బస్టాండ్‌లో గత ఏప్రిల్ 29న పోలీసు ఔట్ పోస్టును ఏర్పాటు చేశారు. షిఫ్ట్‌కు ముగ్గురు సిబ్బంది చొప్పున రోజు మూడు షిఫ్ట్‌లో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నా దొంగతనాలు ఆగడం లేదు. గత మే నెల 23న నగరానికి చెందిన శారద అనే మహిళ హైదరాబాద్ బస్సు ఎక్కి టికెట్ తీసుకునే సమయంలో బ్యాగులోని 5 తులాల బంగారం కనిపించలేదు. సమాచారం మేరకు పోలీసులు వచ్చి బస్సులను తనిఖీ చేసినా, బంగారం లభించలేదు. అదే వారంలో సిద్దిపేట వెళ్తున్న ప్రయాణికుడి జేబులోంచి రూ.లక్షను కొట్టేశారు. ఇలా రోజూ రెండు,మూడు ఘటనలు జరుగుతున్నాయి. ఇవి కాకుండా ఇటవలి కాలంలో పోకిరీల వేధింపు ఘటనలు జరుగుతున్నాయి. అయితే ఘటన జరుగగానే వెంటనే స్పందించాల్సిన ఔట్ పోస్టు పోలీసులు బాధితులను పోలీసుస్టేషన్ వెళ్లి ఫిర్యాదు చేయాలని చెప్పడంతో ఎక్కడెక్కడి నుంచో వచ్చిన ప్రయాణికులు ఠాణాల చుట్టు తిరగలేక తిరుగు ప్రయాణమతున్నారు.

### ఉద్యోగాలకు 'జ్యోతిష్మతి' విద్యార్థుల ఎంపిక

తిమ్మాపూర్ రూరల్, జూన్ 7: తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్)లో బీటెక్ నాలుగో సంవత్స రం సీఎస్ఈ, సీఎస్ఎం చదువుతున్న 12 మంది విద్యార్థులు మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. ఈ మేరకు ఆయన శని వారం విద్యార్థులను అభినందించి, మాట్లాడారు. ఇన్ఫోసిస్ కం పెనీలో ఎస్ శ్రీజ, వై ప్రీతి, ఎస్ విశాఖ, బీ శివాని, పీ మనస్విని, ఎం శ్రీయ, కుర్షద్, డీ ఆశ్రిత రూ.3.6 లక్షల వార్షిక వేతనంతో సిస్టమ్ ఇంజినీర్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. బీ వర్షిత, బీ హరిణి, ఎస్ అక్షిత్, ఎస్ త్రిష రూ.4 లక్షల వార్షిక వేతనంతో కాగ్నిజెంట్ కంపెనీలో ప్రోగ్రామర్ అనలిస్ట్ ట్రైనీ ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఎంతటి ఉద్యోగమైనా సులువుగా సాధించవచ్చన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావుతో పాటు సెక్రటరీ జువ్వాడి సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ డా. అనిల్ కుమార్, డీన్ అకాడమిక్ పీకే వైశాలి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.


నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఎం, సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు

# ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి

కేంద్ర ప్రభుత్వ వైఖరికి వామపక్షాల నిరసన

కరీంనగర్ తెలంగాణచౌక్, జూన్ 7 : మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో వామపక్ష ప్రజా సంఘాల నాయకులు వాటి అనుబంధ విభాగాల కమిటీలతో కలిసి శనివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోని విలువైన అటవీ సంపదను కొల్లగొట్టడానికే ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయిస్తున్నదని ఆరోపించారు. రూ.లక్షల కోట్ల విలువైన అటవీ, ఖనిజ సంపదను తమ అనుకూల కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం కోసమే ఆదివాసీ, గిరిజన, అడవి బిడ్డలకు, మద్దతుగా ఉన్న మావోయిస్టులను లక్ష్యంగా చేసుకొని బూటకపు ఎన్‌కౌంటర్లు చేయిస్తున్నదని మండిపడ్డారు. ఉగ్రవాదులను ప్రోత్సహిస్తున్నదని శత్రుదేశమైన పాకిస్థాన్‌పై యుద్ధానికి దిగిన ప్రధాని నరేంద్ర మోదీ తర్వాత కాల్పుల విరమణ ప్రకటించి ఆ దేశంతో చర్చలు జరపడానికి సిద్ధపడ్డారని, భారతీయులైన మావోయిస్టులు చర్చలు జరుపుతామని ప్రకటించినా ఎందుకు చర్చలు జరపడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్లన్నీ కేంద్రం చేస్తున్న హత్యలేనని మండిపడ్డారు. నియంతృత్వ పాలన సాగిస్తున్న బీజేపీకి రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెపుతారని హెచ్చరించారు. నిరసనలో సీపీఎం నాయకులు గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, ఎడ్ల రమేశ్, నాగామణి, సీపీఐ నాయకులు బుచ్చన్న యాదవ్, పైడిపల్లి రాజు, మల్లవ్వ, మంజుల, మచ్చ రమేశ్ పాల్గొన్నారు.